"రాగవర్ధని"

'విజయ - రాఘవ'

[భువనేశ్వరి, అన్నయ్య రజనీకాంతుడు యింట్లో ఏదో కీచులాడి వెళ్లి ఎక్కడో మరొకచోట మకాం పెట్టాడని విన్నది. భర్తను వెళ్లి ఒకసారి తమయింటికి పిలుచుకుని రమ్మని చెప్పింది. రజనీకాంతుడు ప్రత్యేకంగా నొకగదిలో కాపురముంటూ, చేతిలో డబ్బు మెసలాయింపులేక అన్నఆహారములు మానేసి గడుపుతుంటే ఆతనిని ప్రేమించి ఆరాధిస్తున్న రాగవర్ధని అన్న ఆహారాలేకాదు - సంతోష ఉత్సాహాలను పూరిస్తూవచ్చింది. అది చూచి రజనీకాంతుడు ఆనంద పరవశుడై కృతజ్ఞతను వెల్లడించాడు -- యికచదువండి]

(గతసంచిక తరువాయి)

"యీ మాత్రానికేనా! పరవాలేదు... లెండి! ముందు భోంచెయ్యండి. తరువాత తీరుబడిగా కూర్చొని మాట్లాడుకోవచ్చు" అంది.

రజనీకాంతుడు ఒక్కొక్కముద్దే తింటూంటే, రాగవర్ధని యెప్పుడు యేంకావాలని అడుగుతారో అని ఆత్రుతనయనాలతో అవలోకిస్తోంది.

ఉల్లిపాయముక్కలతో మేళవించబడిన బంగాళా దుంపలకూరముద్ద పూర్తవగానే రెండు గాజుగ్లాసుల మంచినీళ్లు గటగటత్రాగి—

"వర్ధనీ! నువ్వేనా యీ రోజు వంట మీ యింట్లో" అన్నాడు.

"అవును. యేం కూరలో కారం యెక్కువయిందా! వూరికే రొప్పుతున్నారు" అంది.

"ఆ! కాస్త యెక్కువయినట్లే! నువ్వు కారం యెక్కువ తింటావా!" అన్నాడు.

'అవునన్నట్లు' తలూపింది రాగవర్ధని.

"ఆడవాళ్లు కారం యెక్కువ తినకూడదు సుమా!" అన్నాడు.

"యికనుంచి తగ్గించుతా! సరేనా!" అంది.

రజనీకాంతుడు నెమ్మదిగా భోంచేసి, సిగరెట్ ముట్టించి మంచంమీద నడుంవాల్చేటప్పటికి, రాగవర్ధని విస్తరి అవతల పారేసొచ్చి, క్యారియర్ కడిగి, అలమరలోవుంచి చెయితుడుచుకొంటూ రజనీకాంతుడి ప్రక్కకొచ్చి కూర్చొంది.

"వర్ధనీ! నామీద నీకెందుకింత అనురాగం" అన్నాడు రజనీకాంతుడు వున్నట్టుండి.

"అదేమిటండీ! అలా అంటారు. మనిషి జన్మెత్తిన తరువాత యిష్టంలేకుండా యెలా వుంటారు" అంది రాగవర్ధని.

"ఇష్టంవుంటే వుండొచ్చు. అయినా, నామీదే నీకెందుకుండాలి ?"

"ఆ సంగతి భగవంతుడికే తెలియాలి. నాకేం తెలియదు. యిటువంటి ప్రశ్నలకి జవాబు లివ్వడం కూడా చేతగాదు."

"పోన్లేగాని, యింకా యేమిటి కబుర్లు ?"

"ఏముంటయి."

"మీ పెద్దమ్మ బాగుందా !"

"ఆ ... బాగానేవుంది... అన్నట్టు గుర్తొచ్చింది. మొన్న యేంజరిగిందో తెలుసా !" అంది రాగవర్ధని.

"ఏంజరిగింది" - అన్నాడు రజనీకాంతుడు.

"మంచినీళ్ళకోసం మొన్న సాయంత్రం బిందె చంకనపెట్టుకొని నూతికివస్తున్నా. గుడివద్ద కొంత మంది కుర్రవెధవలు కూర్చొని, నావంకచూస్తూ "ఈ అమ్మాయినేరా ... రజనీకాంతుడు ..." అన్నారు. ఆ మాటవినగానే నాకు మహాకోపం వచ్చింది. కాని అదంతా తిన్నది మింగినట్లుమింగి; తలవంచుకొని వచ్చేసాను. ఏంచేయను" అంటూ బేలగా చెప్పుకొచ్చింది రాగవర్ధని.

"మంచిపనిచేసావ్ వర్ధనీ ! లోకులు కాకుల్లాగా కూయకపోతే కోకిల్లాగా కూస్తారా ! అయినా, తీతువుపక్షులు అమంగళంకూయక మంగళం కూస్తాయా ! ఎవరేమన్నాసరే తలవంచుకొని వెళ్ళి పోవలసిన రోజులివి. యేమంటానికి వీల్లేదు. నిన్నే కాదనేది నన్నూ అంతే; నేను చేసేదికూడా యింతే" అన్నాడు రజనీకాంతుడు.

టేబిల్ గడియారం ఒంటిగంటన్నర చూపుతూండగా, ఆఖరిమాటలు రజనీకాంతుడు అంటూండడం జరుగుతూండగా రాగవర్ధనికి నిద్రొచ్చి అతని గుండె మీద వాలిపోయింది. పౌర్ణమి వెన్నెల కిరణాల్లో కొన్ని మాత్రం కిటికీగుండా వాళ్లిద్దర్ని స్పర్శిస్తూ వుండిపోయినయి.

3

రజనీకాంతుడు ఆఫీసుకి వెళ్ళాలి అంటే సొంత యింటిముందునుంచే వెళ్ళాలి. అతను తలవంచుకొని వెళ్ళిపోతుంటే, అతని చెల్లాయిలు,తమ్ముళ్లు వాళ్లమ్మ-నాన్న చూస్తూండేవారు. మనస్పర్ధల నాధారంచేసుకొని వెళ్ళిపోయి వేరుగావుండి భోజనంచేస్తున్నా, రజనీకాంతుని హృదయంలో తల్లిదండ్రులపట్ల ప్రేమ, ఆదరాభిమానాలు నశిస్తాయా! తమ్ముళ్లు - చెల్లాయిలు అంటే యిష్టంలేకపోలేదు. నవమాసాలు మోసి, కనిపెంచిన తల్లిహృదయం తనపట్ల యెంతగా కుమిలిపోతుందో - బాధపడుతూంటుందో అతనికి తెలియకపోలేదు. "కన్ననలుసుకి పట్టెడన్నమైనపెట్టగా నోచలేదే" అని యెంతమందితో తన హృదయాందోళనన్ను వ్యక్తంచేస్తోందో రజనీకాంతుడు వినలేకపోలేదు. కాని అతని హృదయాన్ని విరిచే మాటలు-చేష్టలు యెప్పుడైతే విపరీత పరిణామంలోకి వచ్చేసి, వారినోటి వెంట వినవలసివచ్చిందో, ఆ నాటినుండీ అతని హృదయం వేరుగా బ్రతకడానికి తహతహలాడింది.

తల్లిదండ్రులు కొడుకుని యేమైనా మందలించడానికి హక్కు లేదా! అనిపిస్తుంది యీ సందర్భంలో. ఉంది. చేతికెదిగి, వ్యక్తిత్వం తెలుసుకొని, రెక్కలొచ్చి, ఆదరాభిమానాలు అలవర్చుకొని నలుగురిలో తలెత్తుకొని తిరిగే కొడుకుని మందలించేటప్పుడు, హృదయాన్ని విరిచేట్లుగాదు మాట్లాడేది. ఉపయోగపడేటట్లు మాట్లాడాలి. కన్నకొడుకుని మందలించడం అంటే, మోచేతిక్రింద నీళ్లుత్రాగేవాన్ని చీవాట్లు పెట్టినట్లుగాదు. యీ నాడు తల్లిదండ్రులతో పొత్తుకుదుర్చుకోలేక పోతున్నారంటే కొడుకులు, కారణం యిటువంటిదే ! సవ్యంగా మందలించడంచేతగాదు. పర్యవసానం చూడబోతే కొడుకు కొరగానివాడవుతాడు తల్లిదండ్రులకు; తల్లిదండ్రులు కొరగానివారవుతారు కొడుక్కి. యిందులో వింత లేదు. కాని విచిత్రంమాత్రంవుంది.

ఆ నాడు ఉగాది. రజనీకాంతుడు - నేను ప్రొద్దున్నే లేచి, కాలకృత్యాలు తీర్చుకొని, కాఫీకి

పోతూండగా, యింటిదగ్గరనుంచి రజనీకాంతుడు తమ్ముడొచ్చి "అన్నాయ్! అమ్మ తలంటిపోసుకోడానికి రమ్మందిరా" - అన్నాడు. వెనక్కి తిరగకుండానే రజనీకాంతుడు ... "రానన్నానని చెప్పు" అని తలవంచుకొని సమాధానంచెప్పి ముందుకి రెండడుగులు జోరుగా వేసాడు. ప్రక్కన వున్న వాడికి నాకే గుండె గతుక్కుమంది.

"అదేమిటిరా!" - అన్నాను.

"అది అంతేలే ... ముందునడు తొందరగా" అన్నాడు విసుగ్గా.

ఇక నేనావిషయం యెత్తలేదు. కాఫీలు పూర్తి చేసుకొనివచ్చి, పండుగ కాబట్టి నేనూ రజనీకాంతుని గదిలో ఆ నాడు పన్నెండున్నరవరకు కాలక్షేపంచేసి, భోజనాలయిన తర్వాత పడుకొన్నాం.

సాయంత్రం మూడున్నరకు మళ్లా లేవక తప్పదుగా - యథాలాపంగాలేచి కాళ్లు చేతులు కడుక్కుంటుండగా వాడి చెల్లెలు శారద, వెండిగిన్నెలో యేవో పండుగ పిండివంటలు పట్టుకొచ్చి గుమ్మంలో నిల్చుంది. రజనీకాంతుడు చూశాడు. యేంమాట్లాడలేదు. నేనే వూరుకోక "మీ చెల్లాయి వచ్చిందిరా!" అన్నాను.

"ఎందుకూ!" అన్నాడు శారదవంకచూస్తూ.

"అమ్మ పులిహోర పంపింది తినమని... యిదిగో!" అంటూ చేతికివ్వబోతుండగా—

"అక్కరలేదన్నానని చెప్పు" అన్నాడు కటువుగా.

అన్న రెండునిముషాలసేపు శారద వాకిట్లో నిలబడివుండి తరువాత నెమ్మదిగా వెళ్ళిపోయింది.

నాకు, రజనీకాంతుడంటే వుండే మంచిభావం కాస్తా యెందుకో ఆ సమయంలో అసహ్యంగా మారింది. "వీడికి హృదయంలేదనిపించింది. వీడికి లేదనుకొంటే బాధలేదు, అది అలావుంచు, ముందు వాకళ్ళకైనా వుంటుందని తెలుసుకోలేకపోతున్నాడే" అని బాధపడ్డాను. వాడి మనస్తత్వం అర్థమయిన నాకే యిలాంటి భావాలు రేగినప్పుడు, పరాయివాడు, కొద్ది పరిచయం గల్గినవాడైతే యింకా యేవిధంగా భావించుకొంటాడు. నేనే వుండబట్టలేక—

"ఎంత కఠినంగా మాట్లాడావ్‌రా రజనీ!" అన్నాను.

"వాళ్ళకన్నా ముందు నువ్వెక్కువ బాధపడుతున్నట్లున్నావేరా" - అన్నాడు.

"అవునురా! కన్నతల్లి హృదయం నీ వంటి కఠినాత్ములకు యేంతెలుస్తుంది. మనస్పర్థలు - మాటపట్టింపులుంటే వుండొచ్చు. అవన్నీ దిగమ్రింగుకొని మీ అమ్మ నీకు పంపినప్పుడు, యెందువల్ల పంపిందో, ఆలోచించకుండా, రాయిలాగా మొండిగా జవాబిస్తే, ఆ మాటకు ఆమె యెంతగా బాధపడుతుందో తెలుసా! కనీసం ఆ మాత్రంఅన్నా తెలియదా" అన్నాను వుద్రేకంతో.

"ఎందుకురా నువ్వింత కష్టపడతావ్. అవన్నీ నాకు తెలుసు. బాధ అంటే యేమిటో హృదయానికి బాగా తెలియాలి. అది వ్యక్తుల్ని పరీక్షిస్తుంది. నా తల్లి అంటే నాకు ప్రేమలేదని అనుకోకు. కాని అది ఆచరణలో చూపను. చూపితే నేను యిలా వుండనే వుండను ... తెలుసుకో ... అన్న మాటలు యెన్నిసార్లన్నా నా పట్ల యిచ్చే జవాబు యిదొక్కటే ... సరేనా!" అంటూ రజనీకాంతుడు సిగరెట్ ముట్టించి పడక కుర్చీలో జారగిల పడ్డాడు.

ఇక వాడికి నేనేం సమాధానం చెప్పాలో అర్థంకాక యేదో పుస్తకంమీదకు దృష్టిమార్చాను. కాసేపయిన తర్వాత నెమ్మదిగా యెక్కడికో వెడదామని బయలుదేరాను.

రజనీకాంతుడు నేను వెళ్లిన అరగంటకు బజారుకు వెళ్లిపోయాడు. ఆ నాడు అతని కోసం వేచివుండే

మిత్రులెవ్వరూ కనిపించక పోయేసరికి, సరాసరి పార్కులోకి వెళ్లిపోయాడు. ఒంటరిగా కూర్చొని వార్తలు వింటూండే సమయంలో, ఆనంద్ మోహన్ క్రాంతినాథ్‌లు జంటగా కనిపించారు.

రజనీకాంతుడు యేమీ పల్కరించడానికి పూనుకో లేదు! యిదివరలో యెప్పుడైనా యెక్కడైనా. కనబడితే 'ఏంబావా' అని పల్కరించేవాడు. యీనాడు అటు వంటిదేమీ జరగలేదు. మౌనంగా కూర్చొని, వార్తలు వింటున్నాడు. సరిగ్గా వార్తలయిన వుత్తరక్షణం లోనే, ఆనంద మోహన్ దగ్గరగ — వచ్చి

"ఏరా! రజనీ! బొత్తిగా నల్లపూసవయ్యావ్. కనిపించడంలేదేం" అన్నాడు.

"ఆ...! యేమీలేదు" అని ముక్తసరిగా జవాబిచ్చాడు. యీ సమాధానంలో అంతరార్థం ఆనంద్ మోహన్‌కి యిదివరలోనే తెలుసు. కాబట్టి క్రొత్తగా గుచ్చిగుచ్చి అడగవలసిన పని అనవసరం అనిపించి —

"అదేమిటిరా! మరీ చిక్కిపోతున్నావ్ —" అన్నాడు యీ సారి.

"చిక్కిపోతున్నానా!" తనకుతాను ప్రశ్నించుకొని ఆశ్చర్యపడ్డాడు రజనీకాంతుడు.

"చిక్కడేముంది బావా! ఒకప్పుడు బలిసివున్నా కాబట్టి యిప్పుడు చిక్కిపోతానా! యెప్పుడూ యింతే!" అన్నాడు రజనీకాంతుడు సిగరెట్టు ముట్టించుకొంటూ.

"సరే యీ మాటలకేమొచ్చెగాని, ఒకసారి మీచెల్లాయి నిన్ను రమ్మందోయ్. - యీ మధ్య బొత్తిగా రావడమే మానేశావే!" అన్నాడు ఆనంద్ మోహన్.

"దేనికీ!" - రజనీకాంతుడు తలెత్తి ప్రశ్నించాడు.

"దేనికో నాకు మాత్రం యేంతెలుసు! ఒక వేళ అడిగినా చెప్పే తత్వంగల మనుషులా మీరంతా!" అన్నాడు వెటకారంగా ఆనంద్ మోహన్.

"అంటే చెప్పించుకోవడం తెలియదన్న మాట. అంతేనా బావా!"

"అవునవును నీవన్నది అక్షరాలా నిజమే. యిక నుంచి నేర్చుకోవాలి."

"యీ వేళాకోళానికేమొచ్చెగాని బావా! ఎల్లుండి ఆదివారమేగా ఆ రోజువస్తానని చెప్పు. యివాళా రేపు నాకు తీరికలేదు. యేదో పనులున్నాయి" అంటూ సిమెంటు అరుగుమీదనుంచి లేచి, ఆనంద మోహన్, క్రాంతినాద్‌ల వెంటగేటు దాకావచ్చి యెవరిదారి వారు మెల్లగా చూసుకొన్నారు.

'ఎప్పుడాదివారం వస్తుందా' అని భువనేశ్వరి తారీఖులు లెక్క పెట్టసాగింది. రెండే రెండురోజులు దాటాలి. అన్నయ్య మరీ చిక్కిపోయి వుంటాడని తానూహించుకొంటూనేవుంది. అసలే సన్నగా - గడకర్రలాగా వుండేవాడు. యిప్పుడు యీ హోటలుకూడుతో మరీ సన్నబడి వుంటాడనుకొంటూనేవుంది. యీ అనుకోవడంలో నగ్నసత్యం ఆదివారంనాడు సరిగ్గా తొమ్మిదిన్నర గంటలకి, ఉదయంపూట ఋజువయిపోయింది. రజనీకాంతుణ్ని చూడగానే రెండు నిమిషాలు పిచ్చిదానిలాగా ఆ పాదమస్తకం పరికించి చూసింది. సన్నని సిల్కులాల్చీ, లాంగ్‌క్లాత్ పైజామా, పల్లెటూరి నమూనా సాదాచెప్పులు, కళ్లకు జోడు యివన్నీ మామూలే. అయినా భువనేశ్వరికి ఆశ్చర్యం కలిగింది. ఆ సమయంలో ఆనంద్ మోహన్ దొడ్లో స్నానం చేస్తున్నాడు.

"కూర్చోరా అన్నాయ్" - అంది భువనేశ్వరి. నెమ్మదిగా పడకుర్చీలో కూలబడుతూ, రజనీకాంతుడు

"ఏమిటే! భువనా! కబుర్లు" - అన్నాడు.

"ఏముంటయిరా! నువ్వేచెప్పాలి. బొత్తిగా పూచిక పుల్లయి పోతున్నావురా! అమ్మ వాళ్లంతా కులాసాగా నేవున్నారా!" అంటూ కుశల ప్రశ్నలు వేయడం మొదలుపెట్టింది భువనేశ్వరి.

రజనీకాంతుడుకి యేమని చెప్పాలో మొగం చెల్లక ముక్తసరిగా ఒక్క మాటలో "ఆ...! యేమీ లేదు" అన్నాడు.

"అదికాదురా! పెళ్లి కాకముందే యిలా వుంటే యిక పిల్ల నెవరిస్తారు?"

"తెలియక అడుగుతాను యెవరింటికి వెళ్లినా యిదే ప్రశ్న వేస్తారు? ఎందుకంటావ్ భువనా?"

"ఎందుకేమిటి? నా తలకాయ — పెళ్లీడొచ్చిన వాళ్లు కనబడితే అలా అడగడం ఒక సాంప్రదాయం. ఒక్క మగవాళ్లనేగాదు ఆడవాళ్లనుకూడా అంతే—"

"ఇదో వెధవలవాటు—నన్నడిగితే పోనీ. అడిగి వూరుకోరు. అనవసరంగా ముప్పయిమూడు చెత్త ప్రశ్నలు వెంట, వెంట అడుగుతారు. చెప్పకపోతే

"వీడికెంత గర్వంరా! అని మొగాళ్లు, వీడికెంత నిక్కో అని ఆడవాళ్లు, మూతులు, ముక్కులు విరుచుకొంటారు. చెప్పినందువల్ల యేమిటీ లాభం వీళ్లకు?"

"ఏమిటోయ్? అన్నాచెల్లెలు కలిసి లాభ నష్టాలు తేలుస్తున్నారు." అంటూ ఆనంద్ మోహన్ లుంగి కట్టుకొంటూ వసారాలోకి వచ్చాడు.

"అవునవును తేలుస్తున్నాం నువ్వు కూడా యేమన్నా భాగం పంచుకొంటావా! నష్టాల్లో" అన్నాడు రజనీకాంతుడు.

"మీలాభాలూ — నష్టాలూ నాకేం వద్దుగాని, యీ సంవత్సరం అయినా, పప్పన్నం పెట్టిస్తావా! లేదా!" అన్నాడు ఆనంద్ మోహన్.

"అంటే..."

"అంటే! యేమిటో గ్రహించలేకుండానే వున్నావా! బలేవాడివోయ్. ఆ ముక్క కూడా నానోటితోనే అనిపించాలనేగా -" అన్నాడు ఆనంద్ మోహన్.

"అవును తప్పేముంది. -" అన్నాడు రజనీకాంతుడు.

"సరే అయితే... పెళ్లి... భోజనం యెప్పుడూ?"

"పెళ్లా! చేసుకొందాంలే యేం తొందర.." అన్నాడు.

"చేసుకుందాం! అంటున్నావ్. నన్ను కూడా కలుపుతున్నావ్ యేమిటి!" అన్నాడు ఆనంద్ మోహన్.

"లేదు...లేదు బావా! అది బహువచనంగా ధ్వనించినా, యేక వచనానికే వర్తిస్తుందిలే. కంగారు పడకు —" అన్నాడు రజనీకాంతుడు.

"యీ మాటలకేంగాని లేవండి భోజనాలకు" అంటూ భువనేశ్వరి పమిట చెంగు దులుపుకొంటూ లేచింది.

"నేను సిద్ధంగానే వుంటాగా" - అన్నాడు ఆనంద్ మోహన్ లేస్తూ.

రజనీ కాంతుడు అలాగే పడుకొని వుండటం గమనించి, భువనేశ్వరి దగ్గరగా వచ్చి —

"లేవరా అన్నయ్యా! భోంచేద్దువుగాని" అంది.

"వద్దులేవే! హోటల్ కి వెళ్లేవేళయింది. వెడతా" అంటూ రజనీకాంతుడు లేవబోయాడు.

"అదేమిటిరా! రాకరాక వస్తివి — అప్పుడే పోతానంటుంటివి భోజనం చెయ్యకుండానే; యీ పూట హోటల్ కి వెళ్ళకపోతే ఫరవాలేదులే. రోజూ తింటున్న హోటలేగా. బావగారి ప్రక్క కూర్చొని భోంచేద్దుగాని. నా మాటవినవూ" అంటూ ఆఖరి మాట జాలిగా, ప్రాధేయ పూర్వకంగా వినిపించేటప్పటికి, రజనీకాంతుడికి పోవాలనుకొంటున్న వుద్దేశ్యం నెమ్మదిగా మారి వుండాలనిపించింది.

"ఏమిటిరా! అన్నయ్యా! యింకా ఆలో చిస్తున్నావ్. స్నానం చెయ్యాలా?" అని అడిగింది భువనేశ్వరి.

"లేదే! చేసేవచ్చాను. కాళ్లు మాత్రం కడుక్కుంటా" నన్నాడు.

ఇత్తడి చెంబుతో భువనేశ్వరి కాళ్లుకడుక్కుంటానికి నీళ్లుతెచ్చి యిస్తూండగా, సువర్చల యింటిముందు రిక్షా ఆగింది. చేతిలో చెంబు రజనీకాంతుడికిచ్చి గేటుదగ్గరకు చూడడానికి వెళ్ళింది. 'ఎవరో' పెళ్లీడువచ్చిన అమ్మాయి, నలుపూ, నీలం - ,ఆకు పచ్చ పూవులపరికిణీమీద, వంగపూవంటి వోణీవేసుకొని నల్లసిల్కుజాకెట్టు తొడుక్కొని, చేతిలో చిన్నసంచిలాగుంది, అది పట్టుకొని రిక్షాదిగి లోపలికి వెళ్లడం చూసింది. ఎవరో చుట్టాలనుకొని భువనేశ్వరి వెనక్కి తిరిగి వంటయింట్లోకి, సరాసరి వచ్చేసింది. ఆనంద్ మోహన్, రజనీకాంతుడు పీటల మీద కూర్చొని వున్నారు. యేవో పిచ్చాపాటీ కబుర్లు వారిద్దరిమధ్యా సాగుతున్నయి.

"మళ్ళా యెక్కడి కెళ్ళావ్ యింతలో పెత్తనానికి" అన్నాడు ఆనంద్ మోహన్, భువనేశ్వరి హఠాత్తు రాకచూసి.

"పెత్తనంలేదూ-గిత్తనంలేదూ. సువర్చల యింటి ముందు రిక్షాఆగితే 'యెవరా దిగిందీ' అని చూడ్డానికి వెళ్ళాను" అంటూ అన్నం వడ్డిస్తూ జవాబిచ్చింది.

"ఎవరైతే నీకెందుకు? చెప్పు. అన్నీ నీకే కావాలి. అయినా యింతకీ ఎవరూ వచ్చింది" అని అడిగాడు ఆనంద్ మోహన్ కుతూహలంతో.

"ఎవరొచ్చారో మీకెందుకు చెప్పండి! అన్నీ మీకే కావాలి" అని వెంటనే జవాబిచ్చేటప్పటికి - పచ్చిమిరపకాయ కొరుక్కుంటున్న ఆనంద్ మోహన్ కి, యేమనాలో తెలియక-

"అన్నమాట అనడం బాగా నేర్చావ్. చాల్లే తెలివితేటలు. యెవరైనా చూస్తే నవ్విపోతారు" అన్నాడు.

"ఎవరో పరాయివాళ్లు నవ్వుతారనుకోవడం దేనికి? అయిన వాణ్ణి నాకే నవ్వొస్తోంది మీ మాటలు వింటుంటే" అన్నాడు నవ్వుతూ రజనీ కాంతుడు. ఆ సమాధానంవిని భువనేశ్వరి - ఆనంద్ మోహన్ ఒకొరిమొగాలొకరు చూసుకొని నవ్వుకోవడం మొదలెట్టుకొన్నారు.

ఎంత నవ్వులాటలో మునిగితేల్తున్నా, భువనేశ్వరికి హృదయంలో అణుచుకొన్న సందేహాలు మాటిమాటికి తలలెత్తుతూనే వున్నాయి. భోజనాల వద్ద అడగడం తనకేమీ మంచిగా తోచలేదు. ఒక వేళ భోజనాలయిన తర్వాత, విశ్రాంతిగా పడుకున్నప్పుడు అడుగుతామనుకో! "యివన్నీ అడగడానికేనా భువనా! నన్ను రమ్మన్నది - భోజనం పెట్టింది" అని తనలో తాను బాధపడిపోతాడేమో! అనిపించింది. పోనీ అడగకుండా వూరుకొందామా అంటే మనసు వూరుకోటంలేదు - అడిగేంతవరకు. యెలాగా! యీ సమస్య తేలేది అని పరిపరి విధాలుగా తపించిపోవడం మొదలెట్టింది. రజనీ కాంతుడు - ఆనంద్ మోహన్ యిద్దరూ భోంచేసి వక్కపొడి వేసుకొంటూ వసారాలోకి వచ్చేసి, చెరొక మడతమంచంమీద పడుకున్నారు. భువనేశ్వరి నెమ్మదిగా వెళ్ళి రేడియోట్యూనుచేసి, తానుకూడా భోజనానికి కూర్చొంది. రేడియో సంగీతంవింటూ - రజనీకాంతుడు - ఆనంద్ మోహన్ ఆనాడు మధ్యాహ్నం కాసేపు కన్నుమూసారు.

4

సువర్చల అప్పుడే స్నానంచేసి మధ్యవరండాలో కూర్చొని తలదువ్వుకొంటోంది. యింటిముందు రిక్షా ఆగడం చూసింది. 'ఎవరా!' అని తలపైకెత్తి చూసింది. 'రాగవర్ధని' రిక్షావాడికి డబ్బులిచ్చి వస్తోంది. గబుక్కున తలముడివేసుకొని, యెదురు వెళ్ళి-

"ఇదేనా! రావడం వర్ధనీ" అంది.

"అవునే. యిప్పుడే వస్తున్నా! యెన్నాళ్ళబట్టో వద్దామని, యిల్లు తెలియదాయె. యేంచేయను?

యివాళ యెలాగైనా వెతికి, వెళ్ళాలని బయలు దేరా. అంతా కులాసా" అని అడిగింది రాగవర్ధని చిరునవ్వుతో.

"ఆ ... కులాసాగానే వున్నాం - యెన్నాళ్లయిందే మనిద్దరం కలుసుకొని! దాదాపు రెండు సంవత్సరాలుకాలేదూ! బొత్తిగా చిక్కిపోయావేమే! చూడంగానే గుర్తుపట్టలేకపోయాసుమా! ఎక్కడో చూసినట్లు గుర్తుకొస్తోంది. కాని అవునో, కాదో అని సందేహం" అంటూ సువర్చల లోపలికి తీసికెళ్ళి కూర్చోమని కుర్చీ వేసింది.

"సువర్చల చాపమీద కూర్చొని తలముడివిప్ప తీసుకొని దువ్వుకొంటూ మీ పెద్దమ్మ కులాసాగా వుందా" అని అడిగింది.

"ఆ ... ! యిప్పుడీవూళ్లోనే వుంటున్నాంగా" అంది రాగవర్ధని.

"ఎన్నాళ్లబట్టి ? "

"ఎన్నాళ్లుకాకేం! దాదాపు రెండు సంవత్సరాలయింది."

"మరి యిన్నాళ్ళబట్టి, ఒకసారైనా రాలేదేమే! మా యింటికి. మరిచిపోయావా" అంది సువర్చల వాలుజడ, కొసలుకి నల్లరిబ్బను ముడివేస్తూ.

"మరిచిపోలేదే ! మీరిక్కడుంటున్నారని మొన్నీ మధ్యవరకూ తెలీదు. రాకపోవడానికి చాలా కారణాలున్నాయి. అవన్నీ తర్వాత తీరుబడిగా చెబుతా" అంది రాగవర్ధని. వోణీ చెంగుతో మొగం తుడుచుకొంటూ " "మీవారులేరా" అంది.

"ఉన్నారు. యివాళ ఆదివారంగదూ! సెలవాయె. ఏ లైబ్రరీలోనో వుండివుంటారు. వస్తారు నెమ్మదిగా" అంటూ దువ్వెన, అద్దం టేబిల్ మీద వుంచి, నూనె చేతులు కడుక్కొంటానికి దొడ్లోకి వెళ్ళింది. రాగవర్ధని టేబిల్ మీదవున్న 'ఆంధ్ర పత్రిక' అందుకొని పేజీలు తిరగవేస్తూండగా- యేవో పుస్తకాలుపట్టుకొని, లోపలికివస్తున్న క్రాంతీనాథ్ ని, దొడ్డిగుమ్మంలోంచి సువర్చలచూసి, వాకిట్లోకి చరచరామంటూ వచ్చేసి-

(సశేషము)

ఏజంట్లు కావాలి!

రాజమహేంద్రవరం, హైదరాబాద్, సికిందరాబాద్, గుంటూరు, ఒంగోలు, కడప, తిరుపతి- యింకా యితర ప్రదేశాలలో మా పత్రికలు అమ్మబడని చోట్లలో తమ స్వంత బాధ్యతపై అమ్మటకు - ఏజంట్లుగా నున్నవారికి రూ. 100/-కు రూ. 20/-లు. కమీషను, ఒక ఫ్రీకాపీ యివ్వబడును.

అడ్వర్టైజుమెంటులను కాన్వాస్ చేయువారికి మంచి కమీషను సదుపాయముల నివ్వగలము.

వివరములకు:

గృహలక్ష్మి కార్యాలయం

రాయపేట, మద్రాసు-14